# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 55 | సోమవారం 27, అక్టోబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




## ఇంట్లో ఈగల మోతా.. బయట పల్లకిల మోతా.!

కాంగ్రెస్‌లో అంతర్గత యుద్ధం ఉధృతం..

వడ్డెర సమాజానికి కేసీఆర్ ప్రభుత్వం చేసిన సహాయం గుర్తు

పేదల ఇళ్లు కూల్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటు విమర్శలు

02



## ఎవరి గుబ గుయ్యిమంటుందో చూద్దాం

లక్ష ఇల్లు ఎక్కడ కట్టారు? ఎవరికిచ్చారు? చెప్పాలి

చిన్న వాన పడితే హైదరాబాద్‌లో తిరగలేని పరిస్థితి

హరీష్ రావు కి చామల కిరణ్ రెడ్డి కౌంటర్

02



# కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే సమయం వచ్చింది

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

సనత్‌నగర్ హమాలీ బస్తీలో బొడ్రాయి పండుగలో పాల్గొన్న కేటీఆర్

బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలంటే కారు గుర్తుకు ఓటేయాలని

తలసాని శ్రీనివాస్ యాదవ్ నాయకత్వాన్ని కేటీఆర్ ప్రశంస

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుంటున్నామని, వాటికి శాశ్వత పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి రావాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట డివిజన్‌లో హమాలీ బస్తీ వాసులు నిర్వహించిన బొడ్రాయి పండుగలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా హాజరయ్యారు. హమాలీ బస్తీ ప్రజలు నేతలకు ఘన స్వాగతం పలికి, బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్ పల్లెటూర్లలో నిర్వహించే బొడ్రాయి పండుగను నగరంలో కూడా సంప్రదాయంగా జరపడం ఆనందకరమన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. సనత్‌నగర్‌తో పాటు మొత్తం హైదరాబాద్‌లో ఎక్కడ ఎవరికి కష్టం వచ్చినా అండగా నిలిచే నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్

మిగతా 2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఎలాంటి స్టాండ్ తీసుకోలేదు

అందరి తెలంగాణ కావాలి.. కొందరి తెలంగాణ కావొద్దనేది మా లక్ష్యం

బీఆర్ఎస్ 10 మంది ఎమ్మెల్యేలు ఎందుకు పార్టీ మారారో నాకు తెలియదు

పార్టీ ఏకపక్ష నిర్ణయం తీసుకొని నన్ను బయటకు పంపింది

ఎమ్మెల్సీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశా

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బీఆర్ఎస్ పార్టీ నిర్ణయంపై ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో తనపై విధించిన అన్ని బాధ్యతల నుంచి స్వయంగా రాజీనామా చేసినప్పటికీ, పార్టీ తనను ఏకపక్షంగా బయటకు పంపిందని ఆమె అన్నారు. "ఎవరి పనితీరు ఎలా ఉందో సమీక్ష చేసి ఉంటే, మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిండేది కాదని" కవిత స్పష్టంగా చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో రెండో రోజు కొనసాగుతున్న "జనంబాట" కార్యక్రమంలో మోపాల్ మండలం బైరాపూర్ గ్రామాన్ని పర్యటించిన కవిత, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ, ఈ కార్యక్రమంపై ఒక ఎంపీ ఆధారంలేని ఆరోపణలు చేసింది అని ఆమె సోషల్ మీడియాలో తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఎలాంటి స్టాండ్ తీసుకోలేదని ఆమె అన్నారు. అందరి తెలంగాణ కావాలి.. కొందరి తెలంగాణ కావొద్దు అనేది మా లక్ష్యమని, బీఆర్ఎస్ 10 మంది ఎమ్మెల్యేలు ఎందుకు పార్టీ మారారో నాకు తెలియదని ఆమె వ్యాఖ్యానించారు. పార్టీ ఏకపక్ష నిర్ణయం తీసుకొని నన్ను బయటకు పంపిందని, ఎమ్మెల్సీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని, నేను నా రాజీనామాకు

మిగతా 2లో

## కర్నూలు బస్సు ప్రమాదం మృతదేహాల అప్పగింత

డీఎన్ఏ టెస్ట్ ఆధారంగా గుర్తింపు

అంబులెన్స్‌లతో స్వస్థలాలకు..

ఆధునిక ఫోరెన్సిక్ పద్ధతిలో మృతదేహాల గుర్తింపు



**హైదరాబాద్, ప్రజాస్వరం:**

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన 18 మంది వ్యక్తుల మృతదేహాలను అధికారులు శాస్త్రీయ పద్ధతిలో గుర్తించి, కుటుంబ సభ్యులకు అందజేశారు. డీఎన్ఏ నివేదికల ఆధారంగా ఈ అప్పగింత ప్రక్రియ సాఫీగా సాగింది. మృతుల కుటుంబాలకు మరణ ధ్రువీకరణ పత్రాలు (డెత్ సర్టిఫికెట్లు) కూడా అందజేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్వయంగా

మిగతా 3లో

## మొంథా తుపాను ఏపీ అలర్ట్

ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం

ముంపు ప్రాంతాలపై దృష్టి సారించాం

విపత్తు నిర్వహణ అధికారులతో మాట్లాడుతున్నాం

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తాం

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఏపీ హోంమంత్రి అనిత వెల్లడి



**హైదరాబాద్, ప్రజాస్వరం :**

ఏపీలోని కాకినాడ సమీపంలో అక్టోబర్ 28న అర్ధరాత్రి మొంథా తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపినట్లు ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని, ముఖ్యంగా కాకినాడ పరిధిలోని ఆరు మండలాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. గత నాలుగు రోజులుగా

మిగతా 3లో



## జేఎన్టీయూ ఫ్లైఓవర్‌పై కారు బీభత్సం

డీవైడర్‌ను ఢీకొట్టి బైక్ ను ఢీకొట్టిన కారు

పలువురికి గాయాలు

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

నగరంలోని జేఎన్టీయూ (జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటీ) వంతెనపై ఆదివారం ఉదయం కారు ప్రమాదం జరిగింది. అతి వేగంతో

మిగతా 2లో



## రౌడీ షీటర్లకు మద్దతిచ్చే వాళ్లు సంఘ విద్రోహ శక్తులే

సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య, కానిస్టేబుల్ వీఎస్ఎన్ మూర్తి తెగువ భేష్

యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డీసీపీ, కానిస్టేబుల్‌కు పరామర్శ

వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్న బండి సంజయ్

02




## నేడు మద్యం షాపులకు డ్రా

అన్ని ఏర్పాట్లు చేసిన ఎక్సైజ్ శాఖ | 34 ప్రాంతాల్లో 2620 లాటరీ తీయనున్న కలెక్టర్లు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ ఎక్సైజ్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా 34 ప్రాంతాల్లో 2,620 మద్యం దుకాణాలకు లాటరీ ద్వారా లైసెన్స్ కేటాయించే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ లాటరీ ప్రక్రియ రేపు ఉదయం 11 గంటలకు కలెక్టర్ల చేతుల ద్వారా నిర్వహించబడనుంది. మద్యం షాపుల డ్రాకు హైకోర్టు ఆమోదం కూడా అందించినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 2,620 మద్యం షాపులకు మొత్తం 95,137 దరఖాస్తులు సమర్పించబడ్డాయి. ఈ దరఖాస్తులను లాటరీ విధానంలో

మిగతా 3లో

## జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే

నవీన్ యాదవ్‌కు మాస్ ఫాలోయింగ్

మంత్రి వెంకట్ రెడ్డి ప్రచారం

బీఆర్ఎస్ దోపిడిని ప్రజలు సహించరంటూ వ్యాఖ్య



**హైదరాబాద్, ప్రజాస్వరం :**

తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారం తీవ్రతరంగా మారుతున్న మధ్య, రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఘన మద్దతుగా నిలిచారు. రహ్మత్ నగర్ డివిజన్‌లో జరిగిన ప్రచార సమావేశంలో మంత్రి, స్థానిక ప్రజలను హస్తం చిహ్నంపై ఓటు వేయమని, జూబ్లీహిల్స్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని

మిగతా 3లో



## ఐర్లాండ్ అధ్యక్ష ఎన్నికల్లో కేథరీన్ కన్నోలి ఏకపక్ష విజయం

వామపక్ష స్వతంత్ర నేతను వరించనున్న పదవి

గాజాపై ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకించిన కన్నోలి

రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఐరోపా వైఖరిని తప్పుపట్టిన వైనం

03

# ఎవరి గుబ గుయ్యిమంటుందో చూద్దాం

- లక్ష ఇల్లు ఎక్కడ కట్టారు? ఎవరికిచ్చారు? చెప్పాలి
- చిన్న వాన పడితే హైదరాబాద్‌లో తిరగలేని పరిస్థితి
- హరీష్ రావు కి చామల కిరణ్ రెడ్డి కౌంటర్



తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

మాజీమంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు చామల కిరణ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. "ఎవరి గుబ గుయ్యిమంటుందో హరీష్ రావుకి తొందరలోనే తెలుసుకుందేమో. లక్ష ఇల్లు ఎక్కడ కట్టారు? ఎవరికిచ్చారు? హరీష్ రావే చెప్పాలి" అని అన్నారు. అధికారం చేతిలో ఉండగా, ఇష్టానుసారంగా నాళాలను చెరువులుగా మార్చి, కబ్జాలు చేశారు అని ఆయన విమర్శించారు. చిన్న వానే పడితే హైదరాబాద్‌లో సరిగా తిరగలేని పరిస్థితి ఏర్పడిందని, దానికి కారణం ఎవరు అనేది హరీష్‌రావు వివరించాలన్నారు. ఉపఎన్నికలు హరీష్‌రావు కోసం ట్రబుల్ షూటర్ రోల్ మాత్రమే అవుతున్నాయని చామల కిరణ్ రెడ్డి పేర్కొన్నారు. హుజురాబాద్ ఉపఎన్నికలో ఎంత డబ్బు పెట్టారో ప్రజలకు తెలుసు, జూబ్లీహిల్‌స్‌లో కూడా అదే చేయాలని అనుకుంటే, ఆ నాటకాలు జరగవని స్పష్టం చేశారు. నవీన్ యాదవ్ పేరుకి మించిన ప్రాముఖ్యత వల్ల, బీఆర్ఎస్ ఇంకా గెలవనిదని తెలిసిపోయిందని, ఎవరు గూండాలు, ఎవరు డబ్బులతో గెలవాలని చూస్తున్నారో ప్రజలు 11వ తారీఖున తేలుస్తారని ఆయన చెప్పారు. హరీష్ రావు ప్రజల సెంటిమెంట్ పై ఓట్లు సంపాదించుకోవాలని చూస్తున్నారని చామల కిరణ్ రెడ్డి మండిపడ్డారు. డెవలప్మెంట్‌పై అసలు మాట్లాడడంలేదని, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలను తప్పుదారి పట్టించాలనే ప్రయత్నం చేస్తున్నారు అని విమర్శించారు. "ప్రజలు అమాయకులు కావు. మీ పార్టీ భూస్థాపితం కావడం పక్క, మీరు నువ్వు, నీ బామ్మర్దికి మాత్రమే ఎన్నిక ఫలితాలు చెంప చెల్లిస్తాయని చేయడం ప్రజలు చూడగలరు" అని ఆయన హెచ్చరించారు.

# రౌడీ షీటర్లకు మద్దతిచ్చే వాళ్లు సంఘ విద్రోహ శక్తులే

- సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య, కానిస్టేబుల్ వీఎస్ఎన్ మూర్తి తెగువ భేష్
- యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డీసీపీ, కానిస్టేబుల్‌కు పరామర్శ
- వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్న బండి సంజయ్



తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

సంఘ విద్రోహ శక్తులకు, రౌడీషీటర్లకు మద్దతిచ్చే వాళ్లు కూడా సంఘ విద్రోహశక్తులుగానే పరిగణించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు రాజీ పడొద్దని, ముఖ్యంగా సంఘ విద్రోహ శక్తులను కఠినంగా అణిచి వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో పోలీసులకు కేంద్రం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. రౌడీషీటర్ అన్సారీ దాడిలో గాయపడి సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్, కానిస్టేబుల్ వీఎస్ఎన్.మూర్తి లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం పరామర్శించారు. డీసీపీ, కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్ అన్సారీ దాడితో డీసీపీ, కానిస్టేబుల్ తీవ్ర గాయాలు అయ్యాయని ఈ సందర్భంగా వైద్యులు కేంద్ర మంత్రికి వివరించారు. ప్రస్తుతం మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ చైతన్య, కానిస్టేబుల్ ను పరామర్శించిన బండి సంజయ్ వారు చూపిన తెగువను కొనియాడారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దని, సంఘ విద్రోహ శక్తులను అణిచి వేయాల్సిందేనని చెప్పారు. ఈ విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు.




# ఇంట్లో ఈగల మోతా.. బయట పల్లకిల మోతా.!

- కాంగ్రెస్‌లో అంతర్గత యుద్ధం ఉధృతం..
- వడ్డెర సమాజానికి కేసీఆర్ ప్రభుత్వం చేసిన సహాయం గుర్తు
- పేదల ఇళ్లు కూల్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్‌స్‌లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటు విమర్శలు

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు ఉధృతంగా కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. "ఇంట్లో ఈగల మోతా.. బయట పల్లకిల మోతా కాంగ్రెస్ పరిస్థితి," అని ఆయన ఎద్దేవా చేశారు. పంపకాల విషయంలో తేడాలు రావడంతో మంత్రులు, ముఖ్యమంత్రి ఒకరినొకరు తన్నుకుంటున్నారని వ్యాఖ్యానించారు. "మొన్న కొండా సురేఖ కుమారుడు, నిన్న జూపల్లి కృష్ణారావు ఎలా మాట్లాడారో చూశారు కదా... క్యాబినెట్‌లోనే మంత్రులు, ముఖ్యమంత్రి బట్టలూడదీసుకొని తిట్టుకున్నారట," అని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజల గురించి కాంగ్రెస్‌కు పట్టడం లేదని, పదవుల కోసం, వాటాల కోసం మాత్రమే ఆ పార్టీ నేతలు పోరాడుతున్నారని అన్నారు. ప్రజలకు మళ్లీ మేలు జరగాలంటే కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వడ్డెర సంఘం సమావేశానికి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "వడ్డెర సమాజం అభివృద్ధి చెందాలని మేము కోరుకుంటున్నాం. కేసీఆర్ ప్రభుత్వం ఈ సమాజానికి అనేక రకాలుగా సహాయం చేసింది. సిద్దిపేటలో వడ్డెరల కోసం ట్రాక్టర్లు అందించాం," అని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తమపై అక్రమ కేసులు పెట్టి డబ్బులు వసూలు చేస్తోందని వడ్డెర సోదరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. "కేసీఆర్ ఉన్నప్పుడు హైదరాబాదులో బిల్డింగులు నిర్మించే పనుల్లో వడ్డెరలకు పని దొరికేది, చేతినిండా ఆదాయం ఉండేది," అని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాదులో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే, "రేవంత్ రెడ్డి ఆ ఇళ్లను కూలగొట్టించాడు," అని విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చకుండా ఉండాలంటే, హైదరాబాదు అభివృద్ధి ఆగిపోకుండా ఉండాలంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. "రేవంత్ రెడ్డి ప్రజల ఇళ్లు కూల్చినా, ప్రజలే తనకు ఓటు వేశారంటూ విర్రవీగుతున్నాడు," అని అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీతో గ్యారంటీ కార్డు ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకు వాగ్దానాలు నెరవేర్చలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. "రెండు వేల పెన్షన్‌ను నాలుగు వేల చేస్తామన్న మాట నిలబెట్టారా? కేసీఆర్ కాలంలో రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000కి పెంచాం. కానీ ఇప్పుడు వృద్ధులకూ రూ.4000 ఇవ్వలేదు, మహిళలకు రూ.2500 కూడా ఇవ్వలేదు," అని ఆయన ప్రశ్నించారు. "జూబ్లీహిల్‌స్‌లో ఓటుతో రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలి. డబ్బు మూటలతో, గుండాలతో అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్న రేవంత్ రెడ్డిని ఓటుతో శిక్షించాలి," అని పిలుపునిచ్చారు.

# జేఎన్టీయూ ఫ్లైఓవర్‌పై కారు బీభత్సం

మొదటిపేజీ తరువాయి

వెళ్తున్న కారు ముందుగా రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి, ఆ తర్వాత ఓ ద్విచక్ర వాహనాన్ని గట్టిగా ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న వారితో పాటు ద్విచక్ర వాహన యజమానికి గాయాలు కాగా, రోడ్డు పక్కన ఉన్న వాహనాలు కూడా దాదాపు ఢీకొనే ప్రమాదం తప్పింది. స్థానికులు భయపడిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

**ప్రమాదం ఎలా జరిగింది?**

ఆదివారం ఉదయం 7.50 గంటల సమయంలో ఈ దారుణ ఘటన జరిగింది. రైతు బజార్ దాటి వంతెన ఎక్కుతున్న సమయంలో కారు అదుపుతప్పి, అతి వేగంతో ముందుకు దూసుకెళ్లింది. ముందుగా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఢీకొనడంతో కారు గాల్లోకి ఎగిరింది. ఆ తర్వాత పక్కనే వస్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని గట్టిగా ఢీకొట్టింది. ఫలితంగా కారు పూర్తిగా బోల్తా పడి, రోడ్డు పైనే ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం యజమాని తీవ్ర గాయాలపాలై, స్థానిక ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్‌తో పాటు ఇతరులకు కూడా స్వల్ప గాయాలు అయినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో ట్రాఫిక్ గంటసేపు అంతరాయం ఏర్పడింది.



**కారులో ఎవరు ఉన్నారు?**

ప్రమాదానికి గురైన కారులో మొత్తం ఐదుగురు ఉన్నారు. ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు. యువకులను సూడాన్ దేశస్థులుగా పోలీసులు గుర్తించారు. వీరు హైదరాబాద్‌లోని వివిధ కాలేజీల్లో చదువుకుంటూ, శంషాబాద్ ప్రాంతంలో నివాసముంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ముగ్గురు యువతులు కారు నుంచి దిగి, తక్షణమే మరో క్యాబ్ బుక్ చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇది పోలీసులకు అనుమానం కలిగించింది. యువకులిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని, ఆసుపత్రిలో చికిత్స అనంతరం విచారిస్తున్నారు.

**పోలీసుల దర్యాప్తు**

సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. కారును క్రేన్ సాయంతో తప్పించి, ట్రాఫిక్‌ను సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై లోతైన దర్యాప్తు చేపట్టారు. బీభత్సం సృష్టించిన కారు అద్దెకు తీసుకున్నదా? లేక ఎవరైనా స్నేహితులు ఇచ్చారా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు రిజిస్ట్రేషన్ వివరాలు, అద్దె కంపెనీ రికార్డులు పరిశీలిస్తున్నారు.

**అతి వేగం, మద్యం మత్తు**

కారు డ్రైవర్ అతి వేగంలో ఉన్నాడా? మద్యం సేవించాడా? అనే అంశాలపై బ్లడ్ టెస్ట్‌లు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి విశ్లేషిస్తున్నారు. పారిపోయిన ముగ్గురు యువతులను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వారు కూడా సూడాన్ విద్యార్థులా? లేక స్థానికులా? అనే విషయం స్పష్టం కావాల్సి ఉంది. అదుపులో ఉన్న యువకులు నగరంలో ఏ కాలేజీలో చదువుతున్నారు? వీరి నేపథ్యం ఏమిటి? అనే అంశాలపై విచారణ జరుగుతోంది. వీరిపై ఇతర కేసులు ఉన్నాయా? అనే కోణంలో కూడా తనిఖీ చేస్తున్నారు. జేఎన్టీయూ వంతెన ఎల్లప్పుడూ ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతం. అతి వేగం, మద్యం సేవించి డ్రైవింగ్ వంటి అలసత్వాలు ఇలాంటి దారుణాలకు దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మొత్తం 22 ఫేక్ యూనివర్సిటీలపై యూజీసీ రెడ్ అలర్ట్!

మొదటిపేజీ తరువాయి

డిగ్రీలు పూర్తిగా నకిలీ. ఉద్యోగాలు, ఉన్నత చదువులకు ఎటువంటి విలువ ఉండదు" అని యూజీసీ అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది.

యూజీసీ డేటా ప్రకారం, ఢిల్లీలో 9, ఉత్తర్‌ప్రదేశ్‌లో 5, ఆంధ్రప్రదేశ్‌లో 2 ఫేక్ యూనివర్సిటీలు ఉండగా, కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. మిగిలినవి కర్ణాటక, ఒడిశా మొదలైన రాష్ట్రాల్లో నడుస్తున్నట్టు తేలింది. ఢిల్లీలోని ముఖ్యమైన ఫేక్ సంస్థలు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్, ADRసెంట్రల్ జ్యురిడికల్ యూనివర్సిటీ, విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్‌ఎంప్లాయ్‌మెంట్. ఉత్తర్‌ప్రదేశ్‌లో మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఓపెన్ యూనివర్సిటీ పేర్లు గుర్తింపు లేకుండానే నడుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా కూడా ఇదే జాబితాలో ఉన్నాయి.

ఈ సంస్థలు బ్రోకర్ నెట్‌వర్క్‌ల ద్వారా విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. తక్కువ ఫీజు, సులభమైన అడ్మిషన్లు అని ఆశలు చూపి మోసం చేస్తున్నారు.



తమ పేర్లలో 'నేషనల్', 'టెక్నాలజీ', 'మేనేజ్‌మెంట్', 'ఇన్‌స్టిట్యూట్' వంటి ఆకర్షణీయ పదాలు వాడుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 'విద్యాపథ్', 'పరిషద్', 'ఓపెన్ యూనివర్సిటీ' వంటి శబ్దాలు సాధారణంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో 'యూజీసీ గుర్తింపు ఉంది' అని తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారు. ఈ డిగ్రీలతో ఉద్యోగాలు రావు, మరిన్ని చదువులకు అర్హత ఉండదు. ఫలితంగా విద్యార్థుల డబ్బు, సమయం వృథా అవుతున్నాయి. కొన్ని సంస్థలు మెడికల్, ఇంజినీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు కూడా నిర్వహిస్తున్నాయి, అవి పూర్తిగా చట్టవిరుద్ధం. విద్యార్థులు ఏ సంస్థలో చేరే ముందు యూజీసీ సెక్షన్ 2(ఎఫ్) లేదా సెక్షన్ 3 కింద గుర్తింపు ఉందో లేదో www.ugc.gov.inలో చెక్ చేసుకోవాలి. ఇంజినీరింగ్ కోర్సులకు AICTE, ఫార్మసీకి PCI, మెడికల్ కోర్సులకు NMC అనుమతులు తప్పనిసరి. బ్రోకర్లు, ప్రకటనలు నమ్మి మోసపోవద్దు. సంస్థను స్వయంగా సందర్శించి, అధికారిక డాక్యుమెంట్లు తనిఖీ చేయాలి. మోసం గుర్తైతే యూజీసీకి లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. యూజీసీ ఈ లిస్ట్‌ను నిరంతరం అప్‌డేట్ చేస్తోంది. "ఒక్క రూపాయి ఫీజు కట్టే ముందు యూజీసీ లిస్ట్‌లో చెక్ చేయండి. మీ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది" అని యూజీసీ హెచ్చరించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఎలాంటి స్టాండ్ తీసుకోలేదు

మొదటిపేజీ తరువాయి

కట్టుబడి ఉన్నానని కవిత వెల్లడించారు. విద్యా రంగంలోనూ కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, "సామాజిక తెలంగాణ కోసం ప్రతి జిల్లాలో కార్యక్రమాలు కొనసాగిస్తాను" అని చెప్పారు.





# కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే సమయం వచ్చింది

మొదటిపేజీ తరువాయి

అని ప్రశంసించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంలో కేటీఆర్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే సమయం వచ్చింది. జూబ్లీహిల్‌స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలవాలి అంటే కారు గుర్తుకు ఓటేయండి" అని పిలుపునిచ్చారు. నవంబర్ 11న జరిగే ఎన్నికల్లో జూబ్లీహిల్‌స్‌లోని తమ బంధువులు, స్నేహితులకు కూడా కారు గుర్తుకు ఓటేయమని చెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, పద్మారావు నగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు హేమలత, మహేశ్వరి, సునీత, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, కొలన్ బాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. హమాలీ బస్తీ వాసులు సత్యనారాయణ, సుభాష్, యాదగిరి, రవి, కుషాల్, వెంకటేశ్, సంపత్ తదితరులు పండుగ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే

**మొదటిపేజీ తరువాయి**



విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి, కాంగ్రెస్ పార్టీని "పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే పార్టీ"గా కొనియాడారు. ప్రస్తుతం 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్న ఈ ఎన్నికల్లో, కాంగ్రెస్, BRS, BJP మధ్య త్రికోణ పోటీ రగిలిపోతోంది.

**ప్రజల మధ్య ఉత్సాహం, బీఆర్ఎస్ కేంద్రీకృత విమర్శలు**

రహ్మత్ నగర్‌లో జరిగిన ప్రచార సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, నవీన్ యాదవ్‌ను "యువకుడు, సామాజిక కార్యకర్త"గా పరిచయం చేస్తూ, ప్రజల మధ్య ఉత్సాహాన్ని రేకెత్తించారు. సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి మాటల్లో, "జూబ్లీహిల్స్ అంటే క్లాస్ పీపుల్ ఏరియా అని అందరూ అనుకుంటారు, కానీ ఇది మాస్ ఏరియా. మాస్ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అంటే కాంగ్రెస్ పార్టీనే గుర్తు వస్తుంది" అని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన దోపిడులను తీవ్రంగా ఆరోపిస్తూ, "సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చినా, బీఆర్ఎస్ నేతలు పదేళ్లు దోచుకున్నారు. దోపిడి భరించలేక ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు" అని విమర్శించారు. మంత్రి మాటల్లోనే కొనసాగుతూ, "జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ హవా పెద్ద ఎత్తున కనిపిస్తుంది. మా అభ్యర్థి నవీన్ యాదవ్ గెలవబోతున్నారు. పదేళ్లు సీఎంగా పని చేసిన కేసీఆర్ మా అభ్యర్థి గురించి మాట్లాడారంటే, మా విజయం అక్కడే అర్థమవుతుంది. నవీన్ యాదవ్ రౌడీ అయితే, బీఆర్ఎస్ నేతలపై ఎన్ని కేసులు ఉన్నాయో బయట పెట్టాలి. వాళ్లు మా అభ్యర్థిని చూసి ఓర్వలేక మాట్లాడుతున్నారు" అని హాస్యంగా, కానీ తీవ్రంగా వ్యాఖ్యానించారు. మంత్రి, కంటోన్మెంట్‌లో సెంటిమెంట్ వర్కవుట్ కాదని, ప్రజలు బీఆర్ఎస్ పార్టీని నమ్మే స్థితిలో లేరని, యువకుడైన నవీన్ యాదవ్‌ను ప్రజలు గెలిపిస్తారని నొక్కి చెప్పారు. ఈ ప్రచారం, కాంగ్రెస్ పార్టీలోని యువకార్యకర్తలు, స్థానిక నాయకుల మద్దతుతో ఘనంగా జరిగింది.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మృతితో ఏర్పడిన ఖాళీ**

ఈ ఉప ఎన్నిక, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఏర్పడింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఈ స్థానాన్ని గెలుచుకుంది. కానీ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ఈ ఉప ఎన్నిక బీఆర్ఎస్ 'సర్వైవల్ టెస్ట్'గా మారింది. మొత్తం 3.99 లక్షల మంది ఓటర్లు (పురుషులు 2.07 లక్షలు, మహిళలు 1.91 లక్షలు) ఉన్న ఈ నియోజకవర్గంలో, ముస్లిం ఓటర్లు 88 వేల మందులు ఉండటం ప్రత్యేకం. పోలింగ్ నవంబర్ 11కి, ఫలితాలు 14కి జరగనున్నాయి.

**కాంగ్రెస్ గెలుపు పరిస్థితి ఏమిటి?**

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిచే పరిస్థితి బలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు, స్థానిక నాయకులు అంచనా వేస్తున్నారు. ముఖ్య కారణాలు: మజ్లిస్ ఉప ఎన్నికలో పోటీ చేయకుండా, నవీన్ యాదవ్‌కు మద్దతు ప్రకటించింది. ఎంఐఎం చీఫ్ అసాదుద్దీన్ ఔవైసీ, నవీన్‌ను కలిసి బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి లోపాలను తిట్టారు. "బీఆర్ఎస్ 10 సంవత్సరాలు వృథా చేసింది, జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి లేదు" అని చెప్పారు. 88 వేల ముస్లిం ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపితే, ఇది కీలకమవుతుంది.

అధికార పార్టీగా కాంగ్రెస్, స్థానిక అభివృద్ధి ప్రాజెక్టులు (రోడ్లు, సంక్షేమ పథకాలు) ద్వారా ప్రజలను ఆకర్షిస్తోంది. 40 మంది స్టార్ క్యాంపెయినర్స్ (సీఎం రేవంత్ రెడ్డి తోపాటు) ప్రచారం చేస్తున్నారు. TPCC చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, "50 వేల మెజారిటీతో గెలుపు" అని అంచనా వేశారు.ఆన్‌లైన్ పోల్‌లో బీఆర్ఎస్ 54%, కాంగ్రెస్ 37% వచ్చినప్పటికీ, ఇతర విశ్లేషణల్లో కాంగ్రెస్ ఈ నియోజకవర్గంలో గెలిచే అవకాశం ఉంది. టీడీపీ, బీజేపీ ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పడతాయన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. అయితే టీడీపీ, బీజేపీ మద్దతు దారులు గనక బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే పరిస్థితి కాస్త భిన్నంగా ఉంటుంది. అప్పుడు బీఆర్ఎస్ పార్టీకి అవకాశాలు ఉండొచ్చు. మొత్తంగా, AIMIM మద్దతు, అధికార లాభాలు, నవీన్ యాదవ్ యువత్వం కారణంగా కాంగ్రెస్ గెలుపు దాదాపు ఖాయమని రాజకీయ గుర్తింపు. అయితే, BRS సెంటిమెంట్, బీజేపీ ఓట్లు చీలితే క్లోజ్ ఫైట్ కావచ్చు. ప్రజలు ఎలా ఓటు వేస్తారో నవంబర్ 11 వరకు ఎదురు చూడాలి.

# మొంథా తుపాను ఏపీ అలర్ట్

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయంపై అప్రమత్తంగా ఉంటూ సన్నాహాలు చేస్తున్నారని మంత్రి అనిత తెలిపారు. తుపాను నేపథ్యంలో విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. తుపాను వేగం గంటకు 100 కిలోమీటర్లకు చేరుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో, దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి అనిత మాట్లాడుతూ, భారీ హోర్డింగ్‌లను ముందుగానే తొలగిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, బోట్లను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేలా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఆస్తి మరియు ప్రాణ నష్టాన్ని తగ్గించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ తుపాను సహాయక చర్యలు చేపడుతున్నామని, దీని కోసం ఆధునిక సాధనాలు మరియు డ్రోన్లు వంటి సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. రక్షణ కోసం 6 ఎన్‌డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు మరియు 13 ఎస్‌డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలను సిద్ధం చేశామని చెప్పారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు హెలికాప్టర్లను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. కోస్తా జిల్లాలన్నీ తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉండటంతో, ప్రత్యేకంగా కాకినాడ పరిసర ప్రాంతాలపై దృష్టి పెట్టామని మంత్రి చెప్పారు.

**అధికారులంతా అందుబాటులో ఉండాలి**

మరోవైపు, మొంథా తుపాను దృష్ట్యా రెవెన్యూ అధికారులను మంత్రి అనగాని సత్యప్రసాద్ అప్రమత్తం చేశారు. నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆస్తి మరియు ప్రాణ నష్టం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అధికారులంతా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యలు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని, ముఖ్యంగా తీర ప్రాంతాల్లో అప్రమత్తత పెంచాలని సూచించారు. తుపాను ప్రభావం వల్ల రోడ్లు, విద్యుత్ సరఫరా మరియు ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతినకుండా చూడాలని ఒత్తిడి చేశారు.

**ముందస్తు రక్షణ ఏర్పాట్లు**

తుపాను నేపథ్యంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ముందస్తు రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేశ్‌కుమార్ వెల్లడించారు. జిల్లాలో 90 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఉండటంతో, ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక వాచ్‌పాయింట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ వాచ్‌పాయింట్ల వద్ద అధికారులు మరియు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తారని, ఎన్‌డీఆర్ఎఫ్ మరియు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించుతున్నట్లు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేపట్టకూడదని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 28 మరియు 29 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ సెలవులు విద్యార్థులు మరియు సిబ్బంది భద్రత కోసం తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. అదనంగా, ఆసుపత్రులు మరియు అత్యవసర సేవలు 24 గంటలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**కాకినాడ జిల్లా యంత్రాంగం అప్రమత్తం**

దూసుకొస్తున్న మొంథా తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కాకినాడ జిల్లా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో తీర ప్రాంత గ్రామాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపనున్న నేపథ్యంలో, స్థానికులతో అధికారులు సమావేశం నిర్వహించారు. కాకినాడ ఆర్‌టీవో మధుబాబు మరియు పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీడీ చైత్ర వర్షిణి ఆధ్వర్యంలో మత్స్యకారులతో సమావేశం జరిగింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, బోట్లను సురక్షితంగా ఒడ్డుకు చేర్చాలని కోరారు. మండలంలో 27 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, తీర ప్రాంత వాసులను ఆ కేంద్రాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేంద్రాల్లో ఆహారం, నీరు, వైద్య సదుపాయాలు మరియు ఇతర అవసరాలు సమకూర్చామని అధికారులు తెలిపారు.

# కర్నూలు బస్సు ప్రమాదం మృతదేహాల అప్పగింత

**మొదటిపేజీ తరువాయి**

పర్యవేక్షిస్తూ, ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

**డీఎన్ఏ టెస్ట్‌తో ఖచ్చితమైన గుర్తింపు**

ప్రమాదంలో మృతదేహాలు తీవ్రంగా దెబ్బతినడంతో సాధారణ గుర్తింపు అసాధ్యమైంది. దీంతో అధికారులు ఆధునిక ఫోరెన్సిక్ పద్ధతులను అనుసరించి, మృతదేహాల నమూనాలు, మృతుల బంధువుల డీఎన్ఏ నమూనాలను సేకరించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిపిన పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాతే మృతదేహాలను అప్పగించే ప్రక్రియ ప్రారంభమైంది. "డీఎన్ఏ నివేదికలు 100 శాతం ఖచ్చితత్వం కలిగి ఉంటాయి. ఇలాంటి ఘోర ప్రమాదాల్లో ఇది అనివార్యం" అని జిల్లా వైద్యాధికారి తెలిపారు. ఈ ప్రక్రియలో ఎలాంటి గందరగోళం లేకుండా చూడటానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. మృతుల బంధువుల నుంచి డీఎన్ఏ నమూనాలు సేకరించడం, ల్యాబ్‌కు పంపడం, నివేదికలు వచ్చిన తర్వాత మ్యాచింగ్ చేయడం వరకు ప్రతి అడుగూ కలెక్టర్ ఎ. సిరి నేతృత్వంలో జరిగింది. "కుటుంబాల బాధను అర్థం చేసుకుని, వీలైనంత త్వరగా మృతదేహాలను అప్పగిస్తున్నాం" అని కలెక్టర్ మీడియాతో మాట్లాడారు.

**అంబులెన్స్‌లతో స్వస్థలాలకు..**

మృతదేహాలను మార్చురీ నుంచి స్వస్థలాలకు చేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నేరుగా గ్రామాలు, పట్టణాలకు రవాణా సౌకర్యం కల్పించారు. చాలా మంది మృతులు ఇతర జిల్లాలు మరియు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రయాణికులు కావడంతో, దూర ప్రాంతాలకు కూడా రవాణా ఏర్పాట్లు చేశారు. "అంబులెన్స్‌లు ఉచితంగా అందుబాటులో ఉంచాం. కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక భారం కలగకుండా చూస్తున్నాం" అని అధికారులు వెల్లడించారు.

**మరణ ధ్రువీకరణ పత్రాలు – చివరి అధికారిక గుర్తింపు**

మృతదేహాల అప్పగింతతో పాటు, మరణ ధ్రువీకరణ పత్రాలు కూడా వెంటనే జారీ చేస్తున్నారు. ఇవి ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు, ప్రభుత్వ సహాయం, చట్టపరమైన వారసత్వ హక్కులు వంటి అంశాలకు అవసరం. రెవెన్యూ, పోలీసు, వైద్య శాఖల సమన్వయంతో ఈ పత్రాలు తయారు చేస్తున్నారు. ఇప్పటివరకు 18 మందికి సంబంధించిన పత్రాలు సిద్ధమై, కుటుంబాలకు అందజేశారు.

**ప్రమాద నేపథ్యం మరియు కలెక్టర్ పర్యవేక్షణ**

గత వారం కర్నూలు సమీపంలో జరిగిన ఈ బస్సు ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ప్రయాణికులతో నిండిన బస్సు లారీని ఢీకొనడంతో భారీ ప్రాణనష్టం జరిగింది. మొత్తం మరణాల సంఖ్య ఇంకా అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది, కానీ ఇప్పటివరకు 18 మంది మృతదేహాలు గుర్తించి అప్పగించారు. మిగతా మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కూడా వేగంగా సాగుతోంది. జిల్లా కలెక్టర్ ఎ. సిరి ప్రతిరోజు మార్చురీ దగ్గరకి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వీలైనంత తొందరగా మృతదేహాలను అప్పగిస్తామని ధైర్యం చెప్పారు. "ప్రమాదం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయం అందేలా చూస్తాం" అని ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం, ఉపాధి అవకాశాలు కల్పించే అంశాలపై కూడా చర్చలు జరుగుతున్నాయి.

# ఐర్లాండ్ అధ్యక్ష ఎన్నికల్లో కేథరీన్ కన్నోలి ఏకపక్ష విజయం

- **వామపక్ష స్వతంత్ర నేతను వరించనున్న పదవి**
- **గాజాపై ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకించిన కన్నోలి**
- **రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఐరోపా వైఖరిని తప్పుపట్టిన వైనం**



**హైదరాబాద్, ప్రజాస్వరం**

ఐర్లాండ్ రిపబ్లిక్ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష స్వతంత్ర అభ్యర్థి కేథరీన్ కన్నోలి ఘన విజయం సాధించారు. ఆమెకు సిన్ ఫెయిన్తో పాటు సోషల్ డెమోక్రట్స్, లేబర్, పీపుల్ బిఫోర్ ప్రాఫిట్, గ్రీన్ పార్టీ వంటి వామపక్ష పార్టీలు మద్దతు పలికాయి. ప్రత్యర్థి అయిన సెంటర్‌రైట్ పార్టీ ఫైన్ గాయెల్ అభ్యర్థి హీథర్ హంప్రేయ్స్ ఘోర పరాజయం చవిచూశారు. బారిస్టర్ అయిన కన్నోలి 2016 నుంచి చట్టసభ సభ్యురాలిగా పని చేస్తున్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఆమె బహిరంగంగా వ్యతిరేకించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఐరోపా యూనియన్ సైనికీకరణను కూడా తప్పుబట్టారు. ప్రస్తుత అధ్యక్షుడు మైఖేల్ డి. హిగ్గిన్స్ రెండు పదవీకాలాలు (2011 2025) పూర్తి చేసి వీడ్కోలు పలుకుతున్నారు. ఈ ఎన్నికలు ఐర్లాండ్ రాజకీయ చరిత్రలో ముఖ్యమైన మలుపుగా నిలిచాయి, ఎందుకంటే వామపక్ష శక్తులు ఏకమై ఎస్టాబ్లిష్‌మెంట్ పార్టీలను ఓడించాయి.

**ఐర్లాండ్ అధ్యక్షుడి పాత్ర, ఎన్నికల చారిత్రక నేపథ్యం**

ఐర్లాండ్ అధ్యక్షుడు ప్రధానంగా గౌరవప్రదమైన, ఆచారపరమైన పాత్ర పోషిస్తారు. రాష్ట్రాధిపతిగా రాజ్యాంగాన్ని కాపాడటం, న్యాయమూర్తులు, అధికారుల నియామకం, విదేశీ ప్రతినిధులతో సంబంధాలు వంటివి ఆయన బాధ్యతలు. అయితే, ప్రభుత్వ విధానాల్లో నేరుగా జోక్యం చేసుకునే అధికారం లేదు. రాజకీయ తటస్థత, జాతీయ ఐక్యత ప్రోత్సాహం, నైతిక అధికారం వంటివి ముఖ్యం. 1937 రాజ్యాంగం ప్రకారం, అధ్యక్షుడు 7 సంవత్సరాలకు ఒకసారి ఎన్నికవుతారు, గరిష్ఠంగా రెండు పదవీకాలాలు మాత్రమే. చారిత్రకంగా, 1938 నుంచి జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎక్కువగా ఫియానా ఫెయిల్ పార్టీ అభ్యర్థులు ఆధిపత్యం చూపారు. మేరీ రాబిన్సన్ (1990), మేరీ మెక్‌అలీస్ (1997) వంటి మహిళలు ముఖ్యమైన మైలురాళ్లు. 2011లో మైఖేల్ డి. హిగ్గిన్స్ గెలిచి, 2018లో మళ్లీ ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2025 అక్టోబర్‌లో ముగియడంతో ఈ ఎన్నికలు జరిగాయి. 1990 తర్వాత మూడు అభ్యర్థులతో జరిగిన మొదటి ఎన్నిక ఇది.

**నామినేషన్ ప్రక్రియ**

నామినేషన్లు 2025 సెప్టెంబర్ 5న ప్రారంభమై, సెప్టెంబర్ 24న ముగిశాయి. అభ్యర్థులు ఐరిష్ పౌరులు, 35 ఏళ్లు దాటినవారై ఉండాలి. నామినేషన్‌కు కనీసం 20 మంది పార్లమెంట్ సభ్యులు లేదా 4 కౌంటీ/సిటీ కౌన్సిల్స్ మద్దతు అవసరం. ఎలక్షన్ ఖర్చు పరిమితి 750,000. ఈసారి కౌన్సిల్ నామినేషన్లు ఎవరూ సాధించలేదు, 1990 తర్వాత మొదటిసారి. 2025 జూన్ నుంచే అభ్యర్థుల చర్చలు మొదలయ్యాయి. ఫియానా ఫెయిల్‌లో జిమ్ గావిన్ (Jim Gavin), బిల్లీ కెలెహర్ మధ్య పోటీ ఉండి, గావిన్ సెప్టెంబర్ 9న నామినేట్ అయ్యారు. ఫైన్ గాయెల్‌లో మైరేడ్ మెక్‌గిన్నెస్ ఆగస్టు 14న ఆరోగ్య కారణాలతో వైదొలిగారు, ఆ తర్వాత హీథర్ హంప్రేయ్స్ సెప్టెంబర్ 1న నామినేట్ అయ్యారు. కేథరీన్ కన్నోలి జూలైలో స్వతంత్ర అభ్యర్థిగా ప్రకటించారు. ఇతరులు బెర్టీ అహెర్న్, బాబ్ గెల్డాఫ్ వంటివారు పోటీకి దూరమయ్యారు.

**కీలక అభ్యర్థులు, వారి ప్రొఫైల్స్**

కేథరీన్ కన్నోలి (స్వతంత్ర, వామపక్ష): గాల్వే వెస్ట్ నుంచి 2016 నుంచి టీడీ (TD). మాజీ లేబర్ కౌన్సిలర్, మైఖేల్ డి. హిగ్గిన్స్‌తో విభేదాలతో 2006లో పార్టీ వీడారు. వాతావరణ మార్పు, గృహ సమస్యలు, శాంతి, ఐరిష్ ఐక్యతపై దృష్టి. 79 మంది ఓయిరాచ్టాస్ సభ్యుల మద్దతు సాధించారు.

హీథర్ హంప్రేయ్స్ (ఫైన్ గాయెల్): మాజీ మంత్రి, గ్రామీణ అభివృద్ధి, బార్డర్ రీజియన్ నేపథ్యం. సమాజ ఐక్యత, స్థిరత్వం, సైనిక తటస్థతపై మార్పులు ప్రతిపాదించారు. 55 మంది మద్దతు.

జిమ్ గావిన్ (ఫియానా ఫెయిల్): మాజీ డబ్లిన్ గేలిక్ ఫుట్‌బాల్ మేనేజర్, డిఫెన్స్ ఫోర్సెస్ ఆఫీసర్. సెంట్రిస్ట్ రిపబ్లికన్, సమలింగ వివాహాలు, గర్భస్రావ హక్కులు మద్దతు. అక్టోబర్ 5న అద్దె వివాదంతో వైదొలిగారు, కానీ బ్యాలెట్‌పై పేరు మిగిలింది.

**క్యాంపెయిన్ ఇష్యూస్, పోలింగ్**

క్యాంపెయిన్‌లో గృహ సమస్యలు, వాతావరణ మార్పు, ఐరిష్ ఐక్యత, తటస్థత, ఇమిగ్రేషన్, ప్రభుత్వ పనితీరు ముఖ్యం. కన్నోలి ఆర్థిక న్యాయం, పాలస్తీనా మద్దతు, నియోలిబరల్ విధానాల వ్యతిరేకతపై దృష్టి. హంప్రేయ్స్ యూరోపియన్ స్టాండ్, ఇన్‌క్లూసివ్‌నెస్. RT, వర్జిన్ మీడియా డిబేట్‌లలో గాజా, ఇమిగ్రేషన్ చర్చలు. సోషల్ మీడియాలో డీప్‌ఫేక్స్, యాడ్ ట్రాన్స్‌పరెన్సీ సమస్యలు. "స్పాయిల్ యువర్ వోట్" క్యాంపెయిన్ వల్ల 12.9% వోట్లు చెల్లవు. పోలింగ్: అక్టోబర్ 2123లో కన్నోలి 40 44% లీడ్, గావిన్ వైదొలగడంతో 55.6%కు పెరిగింది. హంప్రేయ్స్ 2534.7%.

**ఫలితాలు**

అక్టోబర్ 24న ఎన్నికలు జరిగి, 25న కౌంటింగ్ మొదలైంది. కన్నోలి 9,14,143 (63.4%) వోట్లు సాధించి రికార్డు సృష్టించారు. హంప్రేయ్స్ 4,24,987 (29.5%), గావిన్ 1,03,568 (7.2%). టర్నౌట్ 45.8% (2018 కంటే 1.9% పెరిగింది), 36 లక్షల మంది ఓటర్లలో 16.56 లక్షలు ఓటేశారు. చెల్లని వోట్లు 2,13,738 (12.9%), అసంతృప్తి సూచిక. కన్నోలి డబ్లిన్ సౌత్‌సెంట్రల్ (79%), గాల్వే వెస్ట్ (77%), డోనెగల్ (75%) లో బలం చూపారు. హంప్రేయ్స్ కావన్‌మోనఘన్ (59%)లో మాత్రమే గెలిచారు. హంప్రేయ్స్ త్వరగా ఓటమి అంగీకరించారు.



# నేడు మద్యం షాపులకు డ్రా

**మొదటిపేజీ తరువాయి**

పరిశీలించి, సరైన కేటాయింపును నిర్ణయించనున్నారు.

**ప్రాంతాల వారీగా దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి:**

ఆదిలాబాద్: 40 షాపులకు 771 దరఖాస్తులు
కోమురం భీం అసిఫాబాద్: 32 షాపులు - 680 దరఖాస్తులు
మంచిర్యాల: 73 షాపులు - 1,712 దరఖాస్తులు
నిర్మల్: 47 షాపులు - 3,002 దరఖాస్తులు
జగిత్యాల: 71 షాపులు - 1,966 దరఖాస్తులు
కరీంనగర్: 94 షాపులు - 2,730 దరఖాస్తులు
పెద్దపల్లి: 77 షాపులు - 1,507 దరఖాస్తులు
రాజన్న సిరిసిల్ల: 48 షాపులు - 1,381 దరఖాస్తులు
ఖమ్మం: 122 షాపులు - 4,430 దరఖాస్తులు
కొత్తగూడెం: 88 షాపులు - 3,922 దరఖాస్తులు
జోగులాంబ గద్వాల: 36 షాపులు - 774 దరఖాస్తులు
మహబూబ్‌నగర్: 90 షాపులు - 2,487 దరఖాస్తులు
నాగర్‌కర్నూల్: 67 షాపులు - 1,518 దరఖాస్తులు
వనపర్తి: 37 షాపులు - 757 దరఖాస్తులు
మెదక్: 49 షాపులు - 1,920 దరఖాస్తులు
సంగారెడ్డి: 101 షాపులు - 4,432 దరఖాస్తులు
సిద్దిపేట్: 93 షాపులు - 2,782 దరఖాస్తులు
నల్లగొండ: 155 షాపులు - 4,906 దరఖాస్తులు
సూర్యపేట్: 99 షాపులు - 2,771 దరఖాస్తులు
యాదాద్రి భువనగిరి: 82 షాపులు - 2,776 దరఖాస్తులు
కామారెడ్డి: 49 షాపులు - 1,502 దరఖాస్తులు
నిజామాబాద్: 102 షాపులు - 2,786 దరఖాస్తులు
మల్కాజిగిరి: 88 షాపులు - 5,168 దరఖాస్తులు
మేడ్చల్: 114 షాపులు - 6,063 దరఖాస్తులు
సరూర్‌నగర్: 134 షాపులు - 7,845 దరఖాస్తులు
శంషాబాద్: 100 షాపులు - 8,536 దరఖాస్తులు
వికారాబాద్: 59 షాపులు - 1,808 దరఖాస్తులు
జనగామా: 47 షాపులు - 1,697 దరఖాస్తులు
భూపాలపల్లి: 60 షాపులు - 1,863 దరఖాస్తులు
మహబూబబాద్: 59 షాపులు - 1,800 దరఖాస్తులు
వరంగల్ రూరల్: 63 షాపులు - 1,958 దరఖాస్తులు
వరంగల్ అర్బన్: 65 షాపులు - 3,175 దరఖాస్తులు

ఈ లాటరీ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలోని మద్యం షాపుల లైసెన్స్‌లను న్యాయపరంగా, పారదర్శకంగా కేటాయించడానికి చర్యలు తీసుకున్నారు. ఇలాంటి ఏర్పాటు ద్వారా న్యాయపరమైన అవకాశాలను కల్పిస్తూ, అవినీతి నివారణకు కూడా దోహదపడుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- కొనుగోలు సెంటర్ లోనే ధాన్యాన్ని విక్రయించాలి
- నాణ్యమైన ఉచిత విద్యుత్ రైతాంగానికి అందాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ అక్టోబర్ 26 (ప్రజా స్వరం) :**

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని, రైతులు దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ మండల రాజ్ పల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని, 33 /11 సబ్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, సబ్ స్టేషన్ లో పలు రికార్డులను పరిశీలించారు. ధాన్యం సేకరణ తీరును, మాశ్చరైజేషన్ను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఏ విధంగా సరఫరా అవుతుందో ఎన్ని గంటలు రైతులకు అందిస్తున్నారు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కేంద్రాల దగ్గర రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారని అందులో మాయిచ్చరైన ధాన్యానికి టోకెన్ అందిస్తున్నామని తెలిపారు. టోకెన్ అందించడంతోపాటు మిల్లులకు కూడా ట్యాగింగ్ ఇచ్చేస్తున్నామన్నారు. ధాన్యం సరఫరాకు వాహనాలన్నీ సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు బిల్లులు త్వరగా చెల్లించేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులు దళారులను నమ్మి రైతులు మోస పోవద్దని,ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ లోనే ధాన్యాన్ని విక్రయించాలని వెల్లడించారు. నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్ రైతులకు అందాలని అధికారులకు సూచించారు.



# సీనియర్ ఉపాధ్యాయులకి టెట్ మినహాయింపు ఇవ్వాలి

- పెండింగ్ లో ఉన్న 5 డిఏ లను వెంటనే ప్రకటించాలి
- పీఆర్సీని 2023 జులై నుండి అమలు చేయాలి
- టీఎస్ యూటీఎస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

**మెదక్, అక్టోబర్ 26 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా కేంద్రం కేవల్ కిషన్ భవన్ లో టీఎస్ యూటీఎస్ మెదక్ జిల్లా కమిటీ సమావేశంలో టీఎస్ యూటీఎస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఉపాధ్యాయులందరూ పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు టెట్ గురించి ఆందోళన చెందుతున్నారని విద్యాహక్కు చట్టం అమలుకు ముందు, ఎన్సిటిఈ నిబంధనలు 2010 ఆగస్టు 23 కంటే ముందే నియామకమైన సీనియర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న ఐదు డీఏ లను వెంటనే క్లియర్ చేయాలని, 2023 జూలై నుండి పీఆర్సీ అమలు చేయాలని, సీపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న బిల్లులన్నింటిని క్లియర్ చేయాలని, రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయుల బిల్లులన్నింటిని తక్షణమే విడుదల చేయాలని, మోడల్ స్కూల్, గురుకులాలు,కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ యూటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పద్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, కోశాధికారి అజయ్, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ సుధాకర్, ఆడిట్ కమిట్ కన్వీనర్ రమేష్ రాజు, కార్యదర్శులు నగేష్, నాగుల మీరా, రవి, భీమ్లా నాయక్, పోచయ్య, యేసయ్య, భూషణం, కె.వి. ఆర్ నాయుడు, గంగాధర్ రావు, శేషగిరి రావు, మహేష్, ప్రేమ్ కుమార్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు

# గుండె పోటుతో యువకుడు మృతి



**మెదక్, అక్టోబర్ 26 (ప్రజా స్వరం) :**

గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మెదక్ పట్టణం నవాపేట్ లో ఆదివారం చోటు చేసుకుంది.. మృతిని కుటుంబికుల, బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... నవాపేట్ వీధి కి చెందిన మహ్మద్ మోహిన్ (35) ఛాతిలో నొప్పి రావడం తో మెదక్ పట్టణం లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉన్నదని తెలపడం తో వెంటనే హైద్రాబాద్ ఆస్పత్రుకి తరలిస్తుండగా మార్గమధ్యం లో గుండెపోటు రావడం తో మృతి చెందాడు.. మృతునికి భార్య అంతుల్ బేగం, కుమారుడు ముస్తఫా ఉన్నారు. అందరితో ఆప్యాయత తో ఉండే మోహిన్ మృతితో దిగ్భ్రాంతికి చెందారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ములుగు, అక్టోబర్ 26 (ప్రజా స్వరం) :**

ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు విని యోగించుకోవాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్ కోరారు. ఆదివారం మండలంలోని క్షిరసాగర్, సింగన్నగూడ,నర్సాపూర్,ములుగు, మామిడ్యాల్, కొట్యాల తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్ గౌడ్ తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని, పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు .ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తా, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మన్-కి-భాత్ ప్రత్యక్ష ప్రసారం




**గుమ్మడిదల, అక్టోబర్ 26 ప్రజాస్వరం :**

గుమ్మడిదల కానుకుంట గ్రామంలో ఆరోవ భూత్ లో బీజేపీ మండల అధ్యక్షులు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో మన్‌కీభాత్ భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి ప్రత్యక్ష ప్రసారం 127వ భాగమును ఆదివారం నాడు ఉదయం వీక్షించడం జరిగింది వీక్షించడం ఐలేష్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం అన్ని రంగాలలో జిల్లాల వారీగా ప్రత్యేక కృషి చేస్తుందని అలాగే భారత ప్రభుత్వ పథకాలను ఆయా మండలాలలోని గ్రామాల ఆయా మండలాలలోని గ్రామాలలకు ప్రతి ఒక్క శక్తి కేంద్రాల ఇన్చార్జులు భూశక్తి కేంద్రాల ఇన్చార్జులు భూత్ అధ్యక్షులు ప్రజల్లోకి తీసు కెళ్లాలని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సు మండల ప్రధాన కార్యదర్శి తూజల్పూర్ రాజు, మండల పధాదికారి ముత్యాల గౌడ్, మాజీ బూత్ అధ్యక్షులు పుర్రె నాగరాజు, కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

# నీటి కష్టాలు తీర్చరేలా..!

- పట్టింపులేని గ్రామ కార్యదర్శి
- గాజీపూర్ గ్రామస్తులు ఆందోళన

**పెద్దేముల్, అక్టోబరు 26(ప్రజాస్వరం):**

తాగునీటి కోసం అల్లాడుతుంటే పరిష్కారం చూపేందుకు ఎవ్వరు చొరవ చూపడం లేదంటూ పెద్దేముల్ మండలంలోని గాజీపూర్ గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడినా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేధన వ్యక్తం చేశారు. గాజీపూర్ గ్రామంలోని 1వ వార్డు బోనమ్మ దేవాలయం ప్రాంతంలో 15 రోజులుగా తాగునీటి సరఫరా కావడం లేదంటు ప్రజలు తెలిపారు. తాగునీటి సరఫరా చేసే బోరు మోటారు మరమ్మత్తులకు గురికావడంతో నీటి కష్టాలు తప్పడం లేదని అంటున్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి విన్నవించినా నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కనీసం ప్రాంతాన్ని పరిశీలించడం లేదని, బోరు మరమ్మత్తులు చేయించడం లేదని వాపోయారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అయినా ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగభూషణం, ముస్తఫా, ఆనంద్, వెంకటయ్య, సర్దార్ బాబోద్దీన్, నాగప్ప పాల్గొన్నారు.






# ఆరోగ్యంగా ఉంటేనే జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, అక్టోబర్ 26(ప్రజా స్వరం):**

ప్రతి మనిషి ఆరోగ్యాంగా ఉంటేనే జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఆదివారం ఉదయం అనంతగిరిలో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ మొదటిసారిగా ట్రయిల్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం లో పాలొన్న కలెక్టర్ మాట్లాడుతూ "మనిషి జీవితంలో ఆరోగ్యమే ప్రధానమని, దేశ శ్రేయస్సు ఆరోగ్యకరమైన జనాభా పై ఆధారపడి ఉంటుందని తెలిపారు. అనంతగిరి అటవీ ప్రాంతం ఔషధమొక్కలకు నిలయమని, ఇక్కడి గాలి ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని, ఈ ప్రాంతములో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ట్రయల్ రన్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో 1000 మందికి పైగా తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. నిర్వాహకులు 5k, 10k, 20k, 32k రన్ నిర్వహించి పథకాలు బహుకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనంతగిరి ఎకో అర్బన్ పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించారు.ఎంట్రీ గేట్ బాగుందని ప్రశంసిస్తూ, పనులలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, అడిషనల్ ఎస్ పి రాము నాయక్,డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్ మరియు హరీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







# అంబేద్కర్ భవనానికి నిధులు మంజూరు చేయాలి

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**శామీర్‌పేట, అక్టోబర్ 26(ప్రజాస్వరం) :**

తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను శామీర్ పేట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఆయను మర్యాదపూర్వకంగా కలిశారు. శామీర్ పేట్ మండల కేంద్రంలోని నిర్మాణంలో ఉన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవనానికి 25 లక్షల నిధులు మంజూరు చేయాలని అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రిఅడ్లూరి లక్ష్మణ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవన నిర్మాణ కొరకు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారనీ తుంకి రమేష్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో దళిత సమాఖ్య అధ్యక్షులు రామ్మోహన్, ఏఎంసి డైరెక్టర్ తుంకి భిక్షపతి, ఊరడి వెంకటేష్ , కొమ్ము వినోద్, మునికొండ నవీన్, పిట్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.





# అయ్యప్ప మహా అన్నప్రసాదం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

- **మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్**

**శామీర్‌పేట, అక్టోబర్ 26 (ప్రజాస్వరం) :**

అఖిల భారత అయ్యప్పచిన్ముద్ర సేవా ట్రస్ట్, తత్వమసి సేవా సమాజం సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న అయ్యప్ప మహా అన్నప్రసాదంలో భాగంగా ఆదివారం మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ను కలవడం జరిగింది. ఇందులో భాగంగా అయ్యప్ప మహా అన్నప్రసాదం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి ఈటల రాజేందర్ అన్నదాన ప్రాముఖ్యత తెలుపుతూ అయ్యప్ప భక్తులకు ఈ అవకాశం ఎంతో ఉపయోగం పడుతుందని అని తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమం చేస్తున్న అఖిల భారత అయ్యప్పచిన్ముద్ర సేవా ట్రస్ట్, తత్వమసి సేవా సమాజం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సిరిసేటి రాజేష్ గౌడ్, డా. బాలు లెంకల, తీగుళ్ల కుమార్, జాతీయ కార్యదర్శి, ఇనుగాల యుగేందర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, డి. చంద్రశేఖర్, గుర్రాల కనకయ్య , మణిపుత్ర మహేష్, కె. హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కొత్త పాఠం

చినుకు రాలితె చిత్తడి
గురించి కాదు ఊరి మత్తడి
యాదిజేసుకున్నేడు మనిషి
మట్టి వాసనకు ముక్కు
మూసుకునే తరమొకటి పు
ట్టుకొస్తుంది
వరిశేను జూసి బియ్యం చేట్టని
మక్కజోన్నని జూసి స్వీట్ కార్న్
అని పలికె తరం పరిగెత్తు
కొస్తుంది
మట్టి వాసన తెలియదు
మమకారం ఎరుగరు
పచ్చిగాలి ఆనవాలు
అసలే తెల్వదు
డాక్టర్ ప్యాకేజి పంతులు
ఫిక్స్ చేసిన ముహూర్తానికి
అందరిని పరేషాన్ చేస్తూ
ఆపరేషన్ థియోటర్లో నుండి
బయటకొస్తాడు
అప్పటికే కార్పొరేట్
స్కూల్లో సీటు
హైవే పక్కన ప్లాటు
రెడీగా ఉంటాయి
ఇప్పుడు తల్లులుకంటున్నది
పిల్లలను కాదు
డాక్టర్లను, కలెక్టర్లను,
ఇంజనీర్లను
మరో బాషలో



మరమనుషులనే...
ఇప్పుడు కొత్త పాఠం
నేర్చుకోవాలి
కొత్త బాటలు వేసుకువాలి
తల్లులు పిల్లలను
కనే రోజు కోసం
మనుషులుగా తీర్చిదిద్దే
రోజుకోసం
కల కందాం
మన పునాదులకు
పూర్వ వైభవం తెద్దాం
పల్లె తనం అంటే
మనిషి తనమని
మట్టి మన
వారసత్వమని చాటి
చెపుదాం.

**- చెన్న రాజు**

**కవి, ఉపాధ్యాయుడు**

**9908010610**



# నా దొంగమొగుడు తెల్లటి దుస్తులు వేశాడు

- **ప్రశాంత్ నీల్ దుస్తుల ఫోటపై భార్య పోస్ట్ వైరల్**

సినిమా ప్రపంచంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్, ఎప్పుడూ తన సినిమాలతోనే కాదు, తన స్టైల్‌తో కూడా చర్చల్లో ఉంటారు. పుట్టింది బెంగళూరులో అయినా తెలుగు కుటుంబానికి చెందిన ప్రశాంత్ చిన్నప్పటి నుంచి టాలీవుడ్ ప్రభావంలో పెరిగాడు. ఆ ప్యాషన్‌నే ఆయన కెరీర్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన దర్శకత్వం వహించిన కేజీఎఫ్ చాప్టర్ 1, 2, అలాగే సలార్ చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్‌గా నిలిచాయి. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ తో డ్రాగన్ వర్కింగ్ టైటిల్ పేరుతో ఓ భారీ సినిమా తెరకెక్కిస్తున్నారు. అయితే ప్రశాంత్ నీల్ సినిమాల్లో ఒక కామన్ ఫీచర్ అందరికీ తెలుసు ఆయన సినిమాలు అన్నీ డార్క్ షేడ్, ఇంటెన్స్ మూడ్ లోనే ఉంటాయి. హీరో నుంచి సపోర్టింగ్ ఆర్టిస్టుల వరకు అందరూ బ్లాక్ డ్రెస్‌ల్లో కనిపిస్తారు. షుటింగ్ లొకేషన్లు కూడా పొగతో, బొగ్గు బ్యాక్‌డ్రాప్‌లతో నిండిపోతాయి. ఈ కారణంగా అభిమానులు సరదాగా 'నీల్‌కి ఈ బ్లాక్ మీద పిచ్చేంటి?' అని కామెంట్లు చేస్తుంటారు. అయితే, ఈ సారి మాత్రం ప్రశాంత్ నీల్ తన అభిమానులను ఆశ్చర్యపరిచాడు. ఎందుకంటే ఆయన మొదటిసారి నల్ల దుస్తులు వదిలేసి తెల్ల సాంప్రదాయ డ్రెస్‌లో కనిపించాడు. ఒక కుటుంబ వేడుకలో భాగంగా అలా రెడి అయ్యారు. ఆ లుక్ చూసిన ఆయన భార్య లిఖితా రెడ్డి ఎమోషనల్ అయి, వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఫైనల్‌గా నా దొంగ మొగుడు తెల్ల బట్టలు వేసాడు అని సరదాగా రాసిన లిఖితా పోస్ట్ క్షణాల్లో వైరల్ అయిపోయింది. అభిమానులు కూడా ఆ ఫోటోపై ఫన్నీ, లవ్‌ఫుల్ కామెంట్లు పెడుతున్నారు. ఎప్పుడూ కఠినమైన, ఇంటెన్స్ లుక్‌లో కనిపించే ప్రశాంత్ నీల్ ఈ సారి సింపుల్ తెల్ల దుస్తుల్లో కనిపించడంతో, అభిమానులు 'సర్‌కి ఈ లుక్ సూపర్‌గా సూట్ అయ్యింది' అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# పురుషాధిక్యంలో మౌనమే సమాధానం

- **కాజోల్ టాక్ షోలో జాన్వీ ఆసక్తికర విషయాలు**

పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సిందేనని నటి జాన్వీకపూర్ అభిప్రాయపడ్డారు. తాను ఎన్నోసార్లు అలా ఉన్నానని చెప్పారు. పరిశ్రమలో కొన్నిసార్లు ఎదుర్కొంటోన్న సమస్యలపై ఆమె 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత కరణ్‌జోహార్‌తో కలిసి జాన్వీ సందడి చేశారు. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అయినప్పటికీ కొన్ని విషయాలు ఇక్కడికి వచ్చాకే నేర్చుకున్నాను. ఇక్కడ కొనసాగాలంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను.. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడించాల్సి ఉంటుంది. దీనికి చాలా నేర్పు ఉండాలి. నేను ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను. ఒక్కోసారి మనల్ని మనం తక్కువ చేసుకోవాలి. ఎంత గొప్పగా నటించే సామర్థ్యం ఉన్నప్పటికీ అవతలి వారి కోసం కొంచెం తగ్గి నటించాల్సి వస్తుంది. అలాగే మరికొన్నిసార్లు మనకు నచ్చని విషయాలను 'ఇది నాకు నచ్చలేదు.. నేను చేయను' అని చెప్పే బదులు.. నాకు అర్థం కావడం లేదు అని చెప్పాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఎన్నో రాజకీయాలను ఎదుర్కోవాలని జాన్వీకపూర్ చెప్పారు. ఈ విషయాలన్నీ ఆ షో వ్యాఖ్యాతల్లో ఒకరైన ట్వింకిల్ ఖన్నా అంగీకరించారు. తాను కూడా 1990ల్లో పరిశ్రమలో ఉన్నప్పుడు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయం తనకు ఇప్పటికీ అర్థం కాదని పేర్కొన్నారు. ఇటీవల కూడా జాన్వీకపూర్ నెపోటిజం గురించి తన అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారు కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయన్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్‌బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న 'పెద్ది'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది.



# రాజాసాబా ప్రమోషన్‌లో కొత్త ఒరవడి

- **ప్రత్యేకంగా షుట్ చేస్తున్న ప్రమోషన్ వీడియో**

ప్రభాస్ అభిమానులకు, సినీ ప్రేక్షకులకు ఒక ఆసక్తికరమైన వార్త తెర మీదకు వచ్చింది. 'రాజా సాబ్' సినిమా విడుదలకు ముందు చిత్ర యూనిట్ మరో ట్రైలర్‌ను విడుదల చేయాలని యోచిస్తోంది. అయితే, ఈసారి ట్రైలర్ విషయంలో దర్శకుడు మారుతి ఒక సరికొత్త పద్ధతిని అనుసరించబోతున్నారు. సాధారణంగా సినిమాలలోని కీ షాట్స్‌తో ట్రైలర్ కట్ చేస్తుంటారు. కానీ, 'రాజా సాబ్' కోసం విడుదల చేయబోయే ఈ రెండో ట్రైలర్‌ను సినిమాలోని సన్నివేశాలతో కాకుండా, దీనికోసం స్పెషల్‌గా షుట్ చేయాలని దర్శకుడు మారుతి భావిస్తున్నారు.ఈ స్పెషల్ వీడియో ప్రమోషనల్ వీడియోలా ఉంటూనే, పూర్తిస్థాయి ట్రైలర్ అంత ఎఫెక్ట్‌ను కలిగించేలా డిజైన్ చేయబోతున్నారు. ఓ రకంగా చూస్తే, సినిమా ప్రమోషన్స్‌లో 'రాజా సాబ్' తో ఒక కొత్త ట్రెండ్ మొదలు కావచ్చు. అయితే ఇది పూర్తిగా కొత్త స్టాటజీ అని చెప్పలేం. ఎందుకంటే సినిమా మీద ఆసక్తి కలిగించేలా ఉన్నా కొన్ని డైలాగ్స్, షాట్స్ తో చేసిన కొన్ని ట్రైలర్స్ ఇప్పటికే రిలీజ్ చేసి తర్వాత సినిమాలో అవి లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ సినిమా విషయంలో కూడా దాదాపుగా అదే స్టాటజీ ఫాలో అవ్వబోతున్నారు. ఈ వినూత్న ప్రమోషనల్ స్టాటజీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.





# ది గర్ల్ ఫ్రెండ్.. అందరికీ కనెక్ట్ అయ్యే కథ

రష్మిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. ఇందులో రష్మికకు జోడీగా దీక్షిత్‌శెట్టి నటిస్తున్నారు. నవంబర్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ధీరజ్ మాట్లాడుతూ.. రష్మిక ఈ సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నారని.. విడుదలయ్యాక రెమ్యూనరేషన్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన కర్నూలు బస్సు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని రష్మిక విచారం వ్యక్తం చేశారు. జాగ్రత్తగా ఉండండి అని అందరూ చెబుతారని.. కానీ, అలాంటి పరిస్థితుల్లో మన చేతిలో ఏమీ ఉండదన్నారు. ఇక సినిమా గురించి మాట్లాడుతూ ఇది ప్రేమకథే కానీ.. ఇప్పటివరకూ ఇలాంటి కథను ఎవరూ తెరకెక్కించలేదన్నారు. చాలా సున్నితమైన కథతో దీన్ని రూపొందించారు. ఈ సినిమా కచ్చితంగా అందరికీ కనెక్ట్ అవుతుంది. నాకు బాక్సాఫీసు నంబర్లు, సక్సెస్ తెలియవు.. ఆడియన్స్‌కు మంచి కథ చెప్పాలని మాత్రమే ఆలోచిస్తాను అని చెప్పారు. రిలేషన్‌లో ఉన్నవారు ఎవరైనా ఈ సినిమాకు కనెక్ట్ అవుతారు. నిజజీవితాలకు దగ్గరగా ఉంటుందీ చిత్రం. నా టీమ్ సపోర్ట్ వల్లే ఈ సినిమాను రూపొందించ గలిగాను. ట్రెండ్‌లో ఉన్న అంశాలతోనే సినిమాలు తెరకెక్కించాలి అనే ఆలోచనను పక్కనపెట్టి ఒక మంచి కథతో మీ ముందుకు వచ్చాం. ప్రేక్షకుల సపోర్ట్ కావాలి. దీక్షిత్, రష్మిక గురించి చాలా చెప్పాలి. ఏ దర్శకులకైనా ఇలాంటి నటీనటులు దొరకడం అదృష్టం. వారి పాత్రలకు జీవం పోశారు. ఈ ఇద్దరూ ఇరగదీశారు. 13 ఏళ్ల నుంచి ఈ కథ గురించి ఆలోచిస్తున్నాను. నేను హాస్టల్‌లో ఉన్నప్పుడు జరిగిన ఓ చిన్న సంఘటన ఈ సినిమాకు పునాది. 5 ఏళ్ల క్రితం దాన్ని స్క్రీన్‌ప్లేగా రాసుకున్నాను. అది ఇన్ని రోజులకు మీ ముందుకు వచ్చిందని రాహుల్ రవీంద్రన్ అన్నారు. దీక్షిత్‌శెట్టి, రష్మిక అద్భుతంగా నటించారు. కచ్చితంగా ఈ చిత్రానికి అవార్డు వస్తుంది. రష్మిక అనడం కంటే ఇండియన్ క్రష్మిక అనాలేమో. ఈ సినిమాకు ప్రేయసితో వెళ్లే అబ్బాయిలు జాగ్రత్తగా ఉండాలి. క్లైమాక్స్ అయ్యాక ఆ అమ్మాయి మిమ్మల్ని హగ్ చేసుకుంటే మీరు మంచి బాయ్‌ఫ్రెండ్.. సైలెంట్‌గా వెళ్లిపోతే మాత్రం కొట్టడం ఖాయం అని బన్నీ వాసు సరదాగా చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999